31

# అంధకారానికి ఆవలివైపు



'చేనేత గుండెకోత' కథా సంకలనం

'లోకానికి బట్ట కట్టడం నేర్పిన నేతన్న ఒంటికి కప్పుకోడానికి చిరిగిన బట్టయినా లేదాయే!' - ఈనాటి సామెత.

అంబరమంత ఆనందంగానూ, అపురూపంగానూ ఉంది సత్యవర్ధన్‌కి. పట్టిందల్లా బంగారం అంటారే..! ఏ మహనీయుడన్నాడో గాని, ఆయన నోటిని తీపి చేసితీరాల్సిందే!!

ఆయన ఏది పట్టుకున్నా బంగారమే... అందుకే అంత ఆనందం కామోసు!

"ఈసారి 'ఛత్రియా గ్రూప్' నుండి నాలుగు పైలట్ ఆపరేటెడ్ హైడ్రాలిక్ సిస్టమ్స్ ఆర్డర్ కన్‌ఫర్మేషన్ వచ్చింది సార్!"

- సెక్రెటరీ తెచ్చిన లెటర్ చూసి ఉబ్బితబ్బిబ్బయ్యాడు సత్యవర్ధన్.

తన ఈ ఇరవై సంవత్సరాల హైడ్రాలిక్ పంప్స్ డిజైనింగ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఫీల్డ్‌లో ఇది ఓ మైలురాయి అని చెప్పొచ్చు. అందులోనూ ఛత్రియా గ్రూప్ నుండి ఆఫర్ వచ్చిందంటే హైడ్రాలిక్ సిస్టమ్స్‌లో గొప్ప మైల్‌స్టోన్‌ని రీచ్ అయినట్టే లెక్క!

ఉత్సాహం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తన ఈ నలభై ఐదు సంవత్సరాల వయస్సులో ఇరవై సంవత్సరాల టీనేజర్ అయి ఎగరాలని ఉంది... ఎగిరి గంతులు వేయాలని ఉంది.

- ఎన్నో విజయాల్ని, విజయ శిఖరాల్ని అందుకున్న సత్యవర్ధన్‌కి ఈ ఆఫర్ నిజంగా ఓ ఎడ్వెంచర్ క్రిందే లెక్క!

ఎదురుగా గోడకు గోవిందయ్యగారి ఫోటో తగిలింపబడివుంది. మనవడి ఉన్నతిని అభినందిస్తున్నాడేమో... ఆయన ముఖం వింతగా మెరుస్తోంది.

'వర్ధనూ! నువ్వింకా ముందుకు సాగిపోవాలిరా!!' అన్నట్లుంది. ఆయన ఫోటోకి వేయబడ్డ గంధపు పూలదండ సువాసనలు ఆ ఏ.సి. కేబిన్ నిండా పరిమళాలను వెదజల్లుతున్నాయి.

గోవిందయ్యగారి మంచితనం, ప్రజలమనిషిగా ఆయన చేసిన సంఘసేవ తలచుకొనేసరికి హృదయం ఆయన పట్ల భక్తిభావంతో నిండిపోయింది.

ఈ ముంబాయి మహానగరంలో ఈనాడు తనో పేరున్న బిజినెస్ మేగ్నెట్‌గా రాణించగలుగు తున్నాడంటే అదంతా తనవాళ్ళ ఆశీర్వాద బలంగాక మరోటి కాదు.

"సర్... సమ్ బడీ ఈజ్ వెయిటింగ్ ఫర్ యువర్ అపాయింట్‌మెంట్!" సెక్రెటరీ మాటల్ని పెద్దగా పట్టించుకోలేదు సత్యవర్ధన్.

ఛత్రియా గ్రూప్ కంపెనీ గుడ్‌విల్ నిలబెట్టుకోవడానికి బాగా కష్టపడవలసి ఉంటుంది. బిన్స్ ప్రొడక్ట్ ప్రమోట్ అయితే ఇంటర్నేషనల్ మార్కెట్‌లో నిలబడగల్గుతుంది. ఆ ఆనందం అతన్ని నిలవనీయడం లేదు.

"సార్! చీరాల శ్రీపతిగారి అపాయింట్‌మెంట్ కాన్సిల్ చేస్తాను" వినయంగా అంటోంది సెక్రెటరీ.

'చీరాల' అని వినేసరికి చిత్రంగా ఫీలయ్యాడు.

ఎవరో తన ఆనందాన్ని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేదు-

స్టిల్ చీరాల... తన తాతగారితో ముడిపడి ఉన్న చీరాల... తను ఊపిరి పోసుకొని ఎదిగిన చీరాల!

ముంబాయి మహానగరంలో... ఎక్కడో బందాలలోని తనకోసం- పుట్టిపెరిగిన ఊరు నుండి ఎవరో రావడం... విచిత్రమైన అనుభూతి సత్యవర్ధన్‌లో నెలకొంది. లేని ఉత్సాహం దూసుకొచ్చి ముందు నిలబడింది.

చిన ముంబాయి నుండి ముంబాయికి వచ్చిన ఆ వ్యక్తికోసం ఉత్సుకత చూపాడు.

"సెండ్ హిమ్ ఇన్!"

"గ్లాట్ టు మీట్ యు... ఐ యామ్ శ్రీపతి!" వచ్చిన వ్యక్తి చేయి కలుపుతూ పలికాడు.

ఉత్సాహం ఉరకలు వేస్తోంది సత్యవర్ధన్ ముఖంలో.

కుర్చీలో కూలబడ్డ వ్యక్తి గదినంతా పరికించి చూస్తున్నాడు. నల్లటి ముఖంమీద బొద్దుమీసాలు, ఖరీదైన కాటన్ పంచె- పైజామా 'ఆయనో పెద్దమనిషి' అని చెప్పక చెప్తున్నాయి. అతని చూపులు గోవిందయ్యగారి ఫోటో దగ్గర ఆగిపోయాయి.

"మా తాత గోవిందయ్యగారు!" సత్యవర్ధన్ మాటల్లో మమకారం కదలాడుతోంది.

"అవును. 'చేనేత' గోవిందయ్య పేరు చెబితే మగ్గం పరుగెడుతూంది. నూలుపోగు పులకిస్తుంది!" పెద్దగా నవ్వుతూ అన్నాడు శ్రీపతి.

తాతగారి గురించి ఓ మంచిమాట పులకింతకు గురిచేసింది సత్యవర్ధన్‌కి.

"వివరంగా చెప్పనే లేదు... నేను విడియాల శ్రీపతి... మాది చీరాల. ఇంకా చెప్పాలంటే ఈపూరుపాలెం!"

"అలా చెప్పడంకన్నా మనది ఈపూరుపాలెం అనడం సబబు!" నవ్వుతూ అన్నాడు సత్యవర్ధన్... మెడకున్న టైని సరిచేసుకుంటూ ఆయన మాటల్ని వింటున్నాడు.

"ఆ మహామనిషి అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని, ఆయన ఆశయాలను పుణికిపుచ్చుకున్న వాడిని. మీ నాన్న చలమయ్య, నేను కలిసి చదువుకున్నాం. వాడు ఆకలిప్రేగుల అపశృతికి బందీయై... నూలుపోగుల కళాసృష్టిలో అసువులు బాసాడు."

మౌనంగా వింటున్నాడు సత్యవర్ధన్. ఒక్క క్షణం ఆగి అడిగాడు- "ప్రస్తుతం మీరు..?"

"చీరాల ప్రాంత ప్రజాప్రతినిధిగా పనిచేస్తున్నాను. నా హయాంలో చేనేతలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగాలన్న ఆశయంతో ముందుకు కదులుతున్నాను. చేతిలో అంత నైపుణ్యం పెట్టుకొని అరడజను కోకలు నేసుకుంటూ పోయే చలమయ్యలాంటి నేతగాళ్ళు ఆరోజుల్లో ఎవరూ లేరు."

తన తండ్రి పనితనాన్నీ, తండ్రి చేతిలో తీరిన చీరాల గొప్పతనాన్నీ పూర్తిస్థాయిలో వివరిస్తున్నాడు శ్రీపతి.

"గోవిందయ్యగారు చేనేత పరిశ్రమ కోసం ఎన్నో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించారు. వారి సమస్యల్ని చట్టసభల్లో నిరంతరం ఏకరువు పెట్టి ప్రభుత్వం నుంచి ఎన్నో రాయితీలు తీసుకొచ్చారు."

శ్రీపతి పెద్దనాయకులతో తాను దిగిన ఫోటోలు, వారితో తనకున్న పరిచయాలు, వాళ్ళు తనకు వ్రాసిన ఉత్తరాలు... అన్నీ చూపిస్తుంటే ఆసక్తిగా చూశాడు సత్యవర్ధన్.

ఏదిఏమైనా... నేతతనం లోని నైపుణ్యం, అందం, వాడిన నూలు, చేతిలో ఎంతో పనితనమున్న కార్మికులు నాలుగు గోడల మధ్య ఆ పల్లెలలో అనామకంగా కాలం వెళ్ళబుచ్చు తుండటం... తల్చుకుంటే బాధ అనిపిస్తోంది సత్యవర్ధన్‌కి.

శ్రీపతి మాటలు, అతనికున్న పరిచయాలు కొంతవరకు సత్యవర్ధన్‌ని ఆలోచింపజేస్తున్నాయి.

తమ తాతముత్తాతల నుంచీ అందరూ నేతపని మీదే ఆధారపడి బ్రతికారట! ముత్తాత చేత్తో నేసిన 'చిలకల చీర' వేరే దేశాలకు్కూడా పంపించేవారట! కానీ, ఇప్పుడు చేనేత పనికిరానిదిగా, విలువ లేకుండాపోయింది. నేతచీర లడిగేవాళ్ళే అరుదైపోయారు.

ఒకనాటి తండ్రి చలమయ్య మాటలు గుర్తుకువచ్చి హృదయం చివుక్కుమంది.

"నాన్నా వర్ధనా... కరెంటు మగ్గాలొచ్చి చేతిమగ్గాల నడుము విరిచేశాయి. ఇప్పుడింకా వాటి అమ్మామొగుళ్ళు జెట్ మగ్గాలొచ్చేశాయనుకో! ఇవి కులవృత్తులకు కాలంచెల్లిన రోజులు. అందుకే నిన్ను ఈ అగాధానికి దూరంగా పంపించేస్తున్నాను" ఆనాటి తండ్రి మాటలు సత్యవర్ధన్‌పై చెరగనిముద్రను వేశాయి.

పైచదువులు చదువుకొని, చిన్నచిన్న వ్యాపారాలు చేసి, క్రమంగా ముంబాయిలో మంచి పొజిషన్‌లో స్థిరపడ్డాడు.

"కన్నతల్లిలాంటి ఈ వృత్తిని నమ్ముకున్న ఎందరికో ఆశాదీపం మీరు... అభినందనలు!" సత్యవర్ధన్ కాంప్లిమెంట్స్ శ్రీపతిని బాగా ఉత్సాహపరిచాయి.

"ఈమధ్య ఆప్కో సంస్థ దివాలా తీసింది. బకాయిలు చెల్లించక సొసైటీల్లో గుట్టలుగుట్టలుగా బట్టలు మూలుగుతున్నాయి. నేతకార్మికుల జీవితాలే ప్రశ్నార్థకమై పోతోంది!" అని చెప్పుకుపోతున్నాడు శ్రీపతి.

ఆయన మాటల్లో కొంత నిజం కనిపిస్తోంది. 'ప్రతిరోజూ పేపర్లో అలవోకగా చదివి ప్రక్కన పడేసే వార్తల వెనక ఇన్ని అగాధాలా..?' అన్పించింది.

"చేతలుడిగిన చేనేతకు జవసత్వాలు నింపడం ఇప్పటి ప్రస్తుత కర్తవ్యం! తద్వారా వివిధ ప్రాంతాలలో నివసిస్తున్నవారిని ఒక వేదికపైకి తీసుకొచ్చి వారి సమస్యలను చర్చించి యాక్షన్‌ప్లాన్ ఒకటి తయారుచేయాలని నా ఉద్దేశం. అందుకే 'వీవర్స్ మేళా' నిర్వహించాలని నిర్ణయించాము."

శ్రీపతి మాటలు సబబుగానే అన్పించాయి.

"కానీ, ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని! మీవంటి పెద్దల సహకారం గురించి దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నాను."

ఎప్పుడో దూరమైన కన్న ఊరు, కన్నతల్లి లాంటి చేనేత వృత్తి తలచుకుంటే తనువు పులకింతకు గురయింది. వెంటనే ఐదు లక్షల చెక్కు వ్రాసి శ్రీపతి చేతిలో పెట్టాడు.

"మీ విరాళం కన్నా మీ రాక మాకు ఆనందదాయకం! అదీ... ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్తగా- ఆదర్శ పురుషుడు గోలిగోవిందయ్యగారి వారసునిగా- ఈ వీవర్స్ మేళాకి ముఖ్యఅతిధిగా... ఇదే మా ఆహ్వానం!"

- అందుకున్న చెక్కును ఆనందంగా జేబులో పెట్టుకుంటూ లేచాడు శ్రీపతి.

●

పుట్టిన ఊరు పులకింతకు గురిచేస్తోంది!

అక్కడివాళ్ళను చూస్తుంటే ఇన్నాళ్లూ సెంటిమెంట్స్ ఏమీలేని శిలావిగ్రహంలా బ్రతికిన సత్యవర్ధన్ అంతరాంతరాల్లో మధురమైన ఆత్మీయతా పరిమళం స్పృశించి మనసుని సేదదీరుస్తోంది.

ఇప్పటి పరిస్థితులలో నేతచీర అడిగేవాళ్ళు, కొనేవాళ్ళు లేక దుర్భరంగా ఉంది. చిలక జరీచీరలు నేసే తండ్రి గుర్తుకువచ్చి గుండె బరువెక్కింది. అప్పట్లో నేసిన చీరలు నిమిషాల మీద పట్టణాలకు తరలిపోయేవి. సమయానికి అందించడం కోసం పనికి ఊపిరి తిరిగేది కాదు. మరి, ఇప్పుడు చిన్నశబ్దం కూడా లేకుండా వల్లకాడైపోయింది.

ఇటువంటి అసాధారణ పరిస్థితుల మధ్య గోవిందయ్య 'నేనున్నా'నంటూ ముందుకు నడిపించగలిగారు. నూలుపోగులతో సృష్టికే అందాలు సృష్టించగలిగిన వారి ఆకలిప్రేగుల సంగీతానికి అల్లాడుతుంటే... అప్పిచ్చేవారు, ఆదుకునేవారు లేనప్పుడు నడుం బిగించి ముందుకు దూకిన ఆ తరం నాయకుడాయన.

అప్పట్లో ప్రభుత్వం ఆయన ప్రజాసేవను గుర్తించి గోవిందయ్యను రాజ్యసభకు నామినేట్ చేసింది.

•

మనసులో వర్షం కురిసినట్లుంది!

ఇరవై సంవత్సరాల తర్వాత పుట్టి పెరిగిన ఊరుని చూస్తున్నందుకు అంతులేని ఆనందం సత్యవర్ధన్‌లో! ముంబాయిలో స్థిరపడ్డ తను... అమెరికాలో స్థిరపడ్డ కొడుకు... తమ ఆర్థిక స్థితిగతులు! కన్నతల్లిలాంటి కన్న ఊరు ముందు అవన్నీ బలాదూరే అయ్యాయి.

'వీవర్స్ మేళాకి విచ్చేయుచున్న
ప్రముఖ పారిశ్రామిక వేత్త గోలి సత్యవర్ధన్‌గారికి సుస్వాగతం!'

– అనే బ్యానర్ మిగతావాటి కన్నా ఆకర్షణగా, ప్రముఖంగా కనబడుతోంది.

రైలు దిగిన సత్యవర్ధన్‌ని శ్రీపతి మొదలు అక్కడి వారందరూ అట్టహాసంగా రిసీవ్ చేసుకున్నారు.

వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన నేతకార్మికులు, కార్యకర్తలతో ఆ ప్రాంతం అంతా కోలాహలంగా ఉంది. బ్యానర్స్‌తో ఆ ఊరు అంతా కళకళలాడుతోంది.

"మన గోవిందయ్య మనవడట! ముంబాయిలో పెద్ద వ్యాపారమట!! తాత ఏలిన రాజ్యాన్ని చూసిపోదామని వచ్చాడట!!" ఓ పెద్దాయన అంటున్నాడు.

"ఏంటీ... చలమయ్య కొడుకా? చాలాసంతోషం నాయనా! మీ తాత మా మానాన మమ్మల్ని వదిలి వెళ్లిపోయిన తరువాత మమ్మల్ని పట్టించుకొనేవారే కరువైపోయారు. గోవిందయ్యలాంటి పుణ్యమూర్తులు గతించిపోయారు. ఆరోజులూ వెళ్లిపోయాయి. అసలు గోవిందయ్య లాంటి మనుషులు మరలా పుడతారంటావా బాబూ!" ఓ ముసలి అవ్వ ఆర్తిని చూసి చలించిపోయాడు సత్యవర్ధన్.

"లేదు బామ్మా! రోజులన్నీ ఒకే మాదిరిగా ఉండవుగా!!" అర్థంకావడం లేదు. తాను మీడియా ద్వారా చూసినదీ, విన్నదీ ఒక్కటి! కానీ, ప్రత్యక్షంగా ఇక్కడ చూస్తున్నది మరొకటి.

"సారు ఎక్కడో ముంబయి నుండి వచ్చారు. మీ సమస్యలు ఏకరువు పెట్టి ఆయన్ని విసిగించకండి. తర్వాత మనం మనం మాట్లాడుకుందాం!!" సత్యవర్ధనాన్ని ప్రక్కకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు శ్రీపతి.

వద్దని వారించాడు. సడన్‌గా ఏదో గుర్తుకువచ్చినట్లయింది. మనసు వికసితమయింది సత్యవర్ధన్‌కి.

"అవునూ... వీరాంజనేయులుగారని మా నాన్న చెప్తుండేవాడు. తాతయ్యను ఎప్పుడూ వెన్నంటి ఉండేవారట... ఇప్పుడెలా ఉన్నారు?" ఆసక్తిగా అడిగాడు సత్యవర్ధన్.

"ఏదో అలా ఉన్నాడయ్యా! ఎనిమిది పదుల వయసు వంటిమీది కొచ్చినా లొంగక తన పనులు తాను చేసుకుంటున్నాడు. చూపుకు లోటు లేదు... ఆరోగ్యానికి కొదవలేదు. ఎటొచ్చీ శరీరం సహకరించడం లేదంతే!"

ఆయన్ని పలకరించాలని అటువైపుగా నడిచాడు సత్యవర్ధన్. ఆత్మాభిమానానికి అవశేషంలా... నిన్నటి వసంతానికి వెన్నంటివున్న శిశిరంలా... ఉంది ఆ ఇంటి స్థితి!

విశ్రాంతి అలవడిన మగ్గాలు విలపిస్తున్నాయి...

జీవన ఆరాటంలో మగ్గాలే ఆలంబనగా బ్రతుకు బండిని ఈడ్చుకొస్తున్న అక్కడి వారందరూ కడు పేదతనానికి పెన్నిధిలా కనబడుతున్నారు.

చితికిపోయిన బ్రతుకురాట్నాల్ని దాటుకొని వీరాంజనేయులు వైపు నడిచాడు.

ఎక్కడో ఎవరో రోదిస్తున్నట్లుంది!

ఆ వింత వాతావరణం తన ఊహల దారాల్ని పుటుక్కున త్రెంపినట్లుగానూ ఉంది. తూట్లు పొడిచినట్లుగా, చిక్కటి చీకట్లు తొలగి, వెలుగురేఖలేవో ప్రసరించిన అనుభూతి ఆ అభాగ్యునిలో.

వీరాంజనేయుల్ని చూస్తుంటే విషయం పూర్తిగా అవగతమవుతోంది. మగ్గం మారాజుల మసకబారిన జీవనసంధ్య సినిమారీలులా కంటి ముందు కన్పిస్తోంది. చేతిలోని నైపుణ్యం, అందం, వాడిన నూలు, చీర డిజైన్లు... అసలు చేతిలో ఇంత పనితనం- ఇలా నాలుగుగోడల మధ్య పల్లెటూర్లో అనామకంగా!

గోవిందయ్య మనవణ్ణి చూసి ఆయన కళ్ళు వింతగా మెరుస్తున్నాయి. కళ్ళలో చుక్కనీరు లేదు... గుండెల్లో ఊరుతున్నాయేమో తెలీదు!

చేనేత కార్మికుల ఆర్తనాదాలు... ఆత్మహత్యలు, అప్పుల తోను, ఆకలి తోను విరక్తి చెంది ఉసురులు తీసుకున్న సంఘటనలు.., చేతిలో పని లేక, గిట్టుబాటు ధరలు లేక ఏ విధంగా అప్పుల పాలవుతున్నది వీరాంజనేయులు వివరించి చెబుతున్నాడు.

అన్నదాతలా వస్త్రదాతను ఆదుకోలేని దుస్థితి! ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాధాన్యత లేని ఖాదీ పరిశ్రమ, విలయతాండవం చేస్తున్న పవర్ లూమ్స్, ఆరిపోతున్న ఆప్కోనేతల సిరిని పెంచి నేతసిరి కోల్పోతున్న సిరిసిల్ల- చేనేత రంగాన్ని ఆవహించిన అన్ని రుగ్మతల్నీ విపులంగా వివరించి చెప్తున్నాడు.

ఆ మాటలలో ఎంతో నిజాయితీ కనబడుతోంది. అంతటి ముసలితనంలోనూ ఆవేశం అతని ఆయుధంగా అన్పిస్తోంది.

"మా కాలంలో గోవిందయ్య లాంటి జాతిగులాబీలు నిస్వార్థంగా నడుం బిగించి జీవితాన్ని త్యాగం చేశారు. కానీ, అన్ని రంగాలలో లాగే ఇక్కడా దళారీ వ్యవస్థ వేళ్లూనుకుపోయింది. చెమటోడ్చే పేదవాడి పనితనాన్ని తుంగలో తొక్కి లక్షలు, కోట్లు మింగడాలు... మేడలు, మిద్దెలు కట్టుకోవడాలు!" ఆగిపోయాడు... వింతగా అన్పించింది సత్యవర్ధన్‌కి.

"అవును బాబూ! ఆ శ్రీపతినే తీసుకో... వాడి బ్రతుకు నాకు తెలుసు. ఆ నయవంచకుడి గతం నాకు తెలుసు. మీ తాతపేరు చెప్పుకొని కాయలు అమ్ముకోవడాలు, 'అట్లా చేస్తున్నాను... ఇది చేయబోతున్నా'నంటూ అందర్నీ ఆశ్రయించడాలు, అందినమటుకు దండుకోవడాలు వాడికి వెన్నతో పెట్టిన విద్య! వాడిలాంటి నయవంచకులు రాజ్యమేలుతుంటే మీలాంటి ఉత్తములు 'మా కెందుకులే...' అనుకుంటున్నారు."

వీరాంజనేయులు మాటలు ఆలోచనల్లో పడేస్తూంటే అక్కడినుండి బయటకు నడిచాడు సత్యవర్ధన్.

'వీవర్స్ మేళా' శ్రీపతి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరుగుతోంది...

కానీ, సత్యవర్ధన్‌కి మటుకు వికటాట్టహాసంగా అన్పిస్తోంది!

వ్యక్తిగత పలుకుబడిని పెంచుకోవడం కోసం, తన ఆస్తుల్ని అభివృద్ధి చేసుకోవడం కోసం ఉద్యమాల్ని ఘణంగా పెట్టడం, ప్రజల్ని పావులుగా వాడుకోవడం... వీరాంజనేయులు చెప్పిన నిజాలు అసహ్యం కల్గిస్తున్నాయి సత్యవర్ధన్‌కి. శ్రీపతి మీద కోపం కట్టలు తెంచుకొస్తోంది.

అక్కడ వచ్చినవారి నందర్నీ ముఖాన చిరునవ్వు పులుముకొని పిలుస్తున్నాడు శ్రీపతి.

చాలా వింత గానూ, విడ్డూరం గానూ ఉంది.

నాయకత్వానికి వివేకం, నిజాయితీ, నిబద్ధత లోపించినపుడు వ్యవస్థ అంధకారంలో మునిగిపోతుంది. ఒక్కసారి మానవతామూర్తి గోవిందయ్య నాయకత్వం, తండ్రి త్యాగధనం మనసులో మెదిలి, తన బాధ్యతనేదో గుర్తుచేసినట్లుంది.

ఆ సభాస్థలికి అల్లంతదూరంలో గోవిందయ్యగారి విగ్రహం కనబడుతోంది. దుమ్ముతో మట్టికొట్టుకుపోయి, పిట్టల రెట్టలతో నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా తోస్తోంది.

వివిధ ప్రాంతాల ప్రతినిధులు తమ తమ వాణిని విన్పిస్తున్నారు.

"చేనేత రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు రెండో గుండె! ప్రపంచానికే తలమానికమైన ఈ పరిశ్రమ ఆకలి కడుపుల్తో, అప్పులతో, ఆత్మహత్యల పరంపరలతో అతలాకుతల మవుతోంది!" మహాత్మాగాంధీని స్మరించుకొని ప్రసంగిస్తున్నాడు ధర్మవరం ప్రతినిధి ధర్మరాజు.

"చేనేత కార్మికరంగం మొత్తం సంక్షోభంలో చిక్కుకుంది... మగ్గాలకు పనిలేక, చెదలుపట్టి శిధిలావస్థకు చేరుకునేంతగా ఉంది!" అని పందిళ్ళపల్లి ప్రతినిధి పరాశరమూర్తి ఆవేదనను వెలిబుచ్చుతున్నాడు.

"ఖాదీ పరిశ్రమ స్వాతంత్ర్యానికి ముందు ఇప్పుడు, అప్పుడు ఓ వెలుగు వెలిగి, చేవ కోల్పోయి, కేవలం ఉత్త వృత్తిగా కరిగిపోతూన్న కొవ్వొత్తిలా ఎందుకు మారిపోయింది?!" అనే అంశాన్ని సిరిసిల్ల నుండి వచ్చిన మహిళా ప్రతినిధి సీతాలక్ష్మి వివరించి చెబుతోంటే సత్యవర్ధన్ మనసుకు అర్థమవుతోంది.

చేనేతను ఆధారం చేసుకొని పుట్టిన కలంకారి శోభలు, కలంకారీ అద్దకాలు అంతర్జాతీయ ఖ్యాతిని గడించిన విధానం ఇప్పుడు ఏ విధంగా కృంగి కృశిస్తున్నదీ మంగళగిరి ప్రతినిధి సర్వమంగళం వివరిస్తోంది.

'పల్లెటూర్లలో పట్టు అందాలు... పట్టు పరిశ్రమ సంక్షోభం' గురించి అనంతపురం నుండి వచ్చిన అనంతరామయ్య చెబుతున్నాడు.

'ఎదిగిన పెట్టుబడిదారీ వ్యవస్థ, పవర్‌లూమ్స్ ప్రవేశం... అనైతిక పోటీలో నిలవలేక వృత్తిని కోల్పోయిన చేనేత కార్మికులు, మగ్గాలను మూలపడేయవలసి రావడాన్ని' కరీంనగర్ ప్రతినిధి కదిరి భక్తవత్సలం సోదాహరణంగా చెబుతున్నాడు.

ఇరవైవేల మగ్గాలున్న సిరిసిల్ల... మగ్గాలను ఆధునీకరించకపోవడం... పవర్‌లూమ్స్‌తో పోటీపడలేక, ఆధునీకరణ లేని మగ్గాలతో పోటీ ప్రపంచంలో చివరిస్థానానికి దిగజారడం వంటివి ఆ ప్రాంతం నుండి వచ్చిన సిరిపురపు సింహాద్రి వివరించి చెప్తున్నాడు.

చేనేత- గ్రామాలలో అంతర్భాగమని, గ్రామీణ భారతం బాగుపడాలంటే వ్యవసాయం మాదిరి చేనేతనూ అభివృద్ధి చేయాల్సిందేనని... పెదన పెంచలయ్య ఉపన్యాసం అక్కడివారిని బాగా ఆకట్టుకొంది.

సత్యవర్ధన్‌కి వాస్తవిక అంశాలు ఒక్కొక్కటీ అవగతమవుతున్నాయి. దేశానికి పట్టుకొమ్మ నేడు ఎంతటి దీనావస్థలో ఉందో- వారి మాటలలో వింటూంటే మనసు చెమ్మగిల్లుతోంది.

శ్రీపతి మైకు పట్టుకొని, చేనేతల సమస్యల కొరకు ఇంతవరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే ఉద్యమాలు, దానికి కావాల్సిన ఆర్థిక వనరులు ఏకరువు పెట్టి విరాళాలు అర్థిస్తున్నాడు. చిత్తశుద్ధి లేని శుష్కవాగ్దానాలు అసహజంగానూ, అసంతృప్తిగానూ తోస్తున్నాయి సత్యవర్ధన్‌కి.

ఒక్కసారి అతని దృష్టి అటువైపు మళ్లింది.

చేతికఱ్ఱ పట్టుకొని, ఒకరిద్దరి సాయంతో నడుచుకుంటూ వస్తున్న ఆ పెద్దమనిషిని చూసేసరికి సత్యవర్ధన్ ముఖం వికసితమైంది. ప్రజల దృష్టి అటువైపుకు మళ్లింది.

వీరాంజనేయులు వయోభారాన్ని లెక్కచేయక చైతన్యానికి చిరునామాలా నడుచుకుంటూ వస్తున్నాడు. సభలో సందడి మాయమై నిశ్శబ్దం అలముకుంటోంది.

"వీరాంజనేయులు ఈ వీవర్స్ మేళాకి రాగలగడం శుభసూచకం! వారిని రెండు ముక్కలు మాట్లాడవలసినదిగా కోరుతున్నాను..." మైక్ అప్పగించి తన స్థానంలో కూర్చున్నాడు శ్రీపతి.

వేదికపై నుండి అందర్నీ ఒక్కసారి పరికించి చూసి, మనసున ఆనందాన్ని నింపుకొని గొంతు విప్పాడు వీరాంజనేయులు...

"ఇది సుదినం! రాష్ట్రంలోని లక్షలాది చేనేత కార్మికులకు పండుగ దినం! మనసులో గూడుకట్టుకున్న వెతల్ని ఉమ్మడి వేదికపై చర్చించుకొనేందుకు ఈ మేళా ఉపయోగపడుతుందని అనుకుంటున్నాను.

ఆద్యుడు గోవిందయ్య సమర్ధ నాయకత్వంలో ఆనాడు ప్రతి చేనేత కార్మికుడు నేతల రారాజుగా వెలుగొందడం ముమ్మాటికీ నిజం! మాటలలో మంచితనం, చేతలలో చిత్తశుద్ధి, అంకితభావం, తనకు ఎవరోగాక సంఘానికి తానెంత ఉపయోగపడతానన్న తృష్ణలతో ఆయన మహనీయుడయ్యాడు. స్వార్థం, సంకుచితత్వాల కతీతమైన ఆయన వ్యక్తిత్వం ఆనాడు మనల్ని ఎంతో ముందుకు తీసుకువెళ్లాయి.

ఏ రాజ్యంలోనైనా రాజు సమర్థత, నిజాయితీ, చిత్తశుద్ధిల మీదే అక్కడ రాచరికం గాని, అరాచకం గాని ఆధారపడి ఉంటాయన్నది నిత్యసత్యం! ఈనాటి ఈ దురవస్థకి దిశ అంటూ లేని గతుకుల గమనమే ప్రధాన కారణమని నా విశ్వాసం! ఉన్నవారిలో చిత్తశుద్ధి లోపించడం, 'మనం' అనే స్థాయి నుండి 'నేను'కి దిగజారడం ఓ ప్రధాన కారణం.

కాలమాన పరిస్థితులను బట్టి ఏ దేశంలో గాని, ప్రాంతాలలో గాని, వృత్తులలో గాని మార్పులు అనివార్యం. దానికి చేనేత పరిశ్రమ అతీతం కాదని నా ఉద్దేశం.

కాలప్రవాహం లోని మార్పులను పసికట్టి, వాటిని తమ పని విధానాలకు అన్వయించుకొని వాటికి అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకోవలసిన బాధ్యత నాయకుల మీద ఉన్నది. నాయకత్వ లేమి ప్రస్తుతం మన ముందున్న ప్రధాన సమస్య!"

వీరాంజనేయులు ప్రసంగం శ్రీపతిని ఆలోచనల్లో పడేశాయి. క్రమంగా అతని ముఖంలో రంగులు మారుతున్నాయి. అచేతనంగా ఉండిపోవడం తప్ప ఏమీ చేయలేకపోతున్నాడు.

"గోవిందయ్య ఆశయాల్ని నెరవేర్చడం కోసం, ఆ మహనీయుని స్థానాన్ని సత్యవర్ధన్ బాబుతో భర్తీ చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది..."

తమందరికీ సమ్మతమేనంటూ పెద్దగా హర్షధ్వానాలు విన్పిస్తున్నాయి.

"ఆయన ముంబాయిలో పెద్దపెద్ద వ్యాపారాల్లో ఉన్నా అవన్నీ ప్రతిబంధకం కాదని నా ఉద్దేశం! మన మధ్య ఉంటూ, మనవాడిగా చేనేతలకు పూర్వవైభవం తీసుకొస్తాడని మీ అందరిలోకి వయసులో పెద్దవాడిగా కోరుతున్నాను. ఈ చిరంజీవికి నా ఆశీర్వచనాలు తెలియజేస్తున్నాను..."

చప్పట్లు మిన్నుముట్టుతున్నాయి.

సత్యవర్ధన్‌లో ఒకింత ఉద్వేగం... ఆనందం! తనవారు ఇంత బృహత్తరమైన బాధ్యత తనమీద పెట్టడం... ఆలోచనలో పడ్డాడు.

"సత్యవర్ధన్‌గారికి పూర్తి సహకారముంటుందని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ఆయన్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాను..."

శ్రీపతి మాటలకి మరోసారి హర్షద్వానాలు మిన్నుముట్టాయి.

అంబరమంత ఆనందం సత్యవర్ధన్‌లో! ఎక్కడో తమ వ్యాపారాలు, సంపాదన, కుటుంబం... అవన్నీ పెద్దగా ప్రాముఖ్యత లేని అంశాలుగా తోస్తున్నాయి సత్యవర్ధన్‌కి. వాటన్నింటికీ అతీతమైన బాధ్యతేదో తనని వారితో మమేకం చేస్తోంది.

తమ వ్యాపారాలను ఇక్కడినుంచైనా పర్యవేక్షించుకోవచ్చునన్న ఊహ- కొండంత బలాన్ని ఇస్తోంది సత్యవర్ధన్‌కి. మారిన ముఖంలోని ఆ సంతోషరేఖలే ఆయన అంగీకారాన్ని తెలియజేస్తున్నాయి.

వారి ప్రతిపాదనలకు ప్రకృతి కూడా పులకించిందేమో... చిన్న చిరుజల్లులతో స్వాగతిస్తున్నట్లుంది. దూరంగా గోవిందయ్య విగ్రహం- చినుకులన్నీ మమేకమై ఆ మహనీయునిపై ఉన్న దుమ్మునీ, ధూళినీ కడిగేస్తున్నాయి.

ఇప్పుడు ఆ దివ్యమూర్తి నూతనశోభతో తళతళా మెరిసిపోతున్నాడు.

కథా నిలయం
శ్రీకాకుళం

చేనేత గుండెకోత